JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 05-04-2026
Medchal - Malkajgiri । Sunday 05-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 308
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 308 । Pages : 8 । ₹: 5



7 లో

# రాములమ్మ శాపనార్థాలు

- 25 వేల రూపాయల పింఛను, ఉద్యోగాలు, భూములు ఇవ్వాలని
- అటు మండలిలో రాములమ్మ, ఇటు అసెంబ్లీ రాజగోపాల్‌రెడ్డి చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయన్న చర్చ
- క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్‌తోనే సరిపెడుతారా..? లేక ప్రక్షాళన చేస్తారా..



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 4 :**
కాంగ్రెస్ పార్టీ నాయకురాలు.. ఎమ్మెల్సీ విజయశాంతి.. ఉరఫ్ రాములమ్మ.. ఇటీవల మండలి సమావేశాల్లో చివరి రోజు పెద్ద ఎత్తున మాట్లాడిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న వారికి న్యాయం చేయాలని.. లేక పోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర హీనంగా మిగిలిపోతుందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. 25 వేల రూపాయల పింఛను, ఉద్యోగాలు, భూములు ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై వేసిన కమిటీ కాలయాపన కమిటీగా ఉందన్నారు. ఉద్యమ కారుల తరపున విజయశాంతి మండలిలో పలు వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంపై( బీఆర్ఎస్)పైనా విమర్శలు చేసినా.. అవి సునిశితంగా

...మిగతాది 2 లో



### పవిత్ర జ్ఞాన సరస్వతి ఆలయ క్షేత్రం

బాసర అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించాను. ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ లో పలు మార్పులు చేర్పులు సూచించాను. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాను. ఆలయ పరిసరాల్లో EV వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించాను. ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని అధికారులకు స్పష్టంగా సూచించాను.

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# రూ. 225 కోట్లతో అభివృద్ధి

**జయభేరి, హైదరాబాద్ :**
బాసరలోని పవిత్ర జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి జరగాలని ఈ సందర్భంగా అధికారులకు చెప్పారు.
నిర్మల్ జిల్లా గోదావరి నది ఒడ్డున ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయాన్ని ప్రభుత్వం రూ. 225 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు వివరించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. 6వ తేదీన ఈ ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సువిశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భక్తుల విశ్వాసాలు దెబ్బ తినకుండా ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలని, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తిరుపతి తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావు లేకుండా నిబంధనలు ఉండాలని చెప్పారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేంనరేంధర్ రెడ్డి, CS కె. రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి



2 లో

- సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ఫొటోతో క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు


**జయభేరి, హైదరాబాద్ :**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా స్పందించారు. సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ఫొటోతో క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు, అక్కడ ముఖ్యమంత్రి ఫొటోను ఉంచారు. అనంతరం కార్యాలయంలో జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు.

# ఉప్పల్ లో మ్యాచ్

- ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు, ట్రాఫిక్ ఆంక్షలు
- స్టేడియం పరిసరాల్లో 430 సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు

**జయభేరి, హైదరాబాద్ :**
హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న టాటా ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు, ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించారు. ఏప్రిల్ 5 నుంచి మే 22 వరకు ఏడు మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో, మ్యాచ్ జరిగే రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11:50 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని మల్కాజ్‌గిరి,

...మిగతాది 2 లో




# పబ్స్ పై ఈగల్ పంజా

- కొండాపూర్‌లోని క్వేక్ అరీనా పబ్‌లో డీజే బ్లాక్ కాఫీ పేరుతో జరిగిన ఈవెంట్‌పై విశ్వసనీయ సమాచారం
- పార్టీకి హాజరైన వారిలో ఎనిమిది మంది డ్రగ్స్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 4 :**
హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు పోలీసులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా ఈగిల్ బృందం చ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్‌లపై మెరుపు దాడులు నిర్వహించింది. కొండాపూర్‌లోని క్వేక్ అరీనా పబ్‌లో డీజే బ్లాక్ కాఫీ పేరుతో జరిగిన ఈవెంట్‌పై విశ్వసనీయ సమాచారం అందడంతో అధికారులు రంగంలోకి దిగారు. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు సాగుతున్న ఈ వేడుకలో డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న అనుమానంతో అక్కడికక్కడే లైవ్ డ్రగ్ టెస్టులు నిర్వహించడం కలకలం రేపింది.పబ్‌లో ఉన్న అనుమానితులకు నిర్వహించిన డ్రగ్ అనాలిసిస్ పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. పార్టీకి హాజరైన వారిలో ఎనిమిది మంది డ్రగ్స్ తీసుకున్నట్లు పరీక్షల్లో తేలింది. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి, ఈ డ్రగ్స్ ఎక్కడి

...మిగతాది 2 లో

# అమరావతి పరుగులు పెట్టాల్సిందే..



- గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడంలో ఎదురైన సవాళ్లను అధిగమించి, టెండర్ల ప్రక్రియను పూర్తి
- కేవలం భవనాలే కాకుండా భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా రోడ్ల నెట్‌వర్క్, హౌసింగ్ ప్రాజెక్టులు వేగంగా సాగాలని స్పష్టం

**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 4 :**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రస్తుతం అమరావతిలో రూ. 57,821 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడంలో ఎదురైన సవాళ్లను అధిగమించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. రాజధానిలో అత్యంత కీలకమైన అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్

...మిగతాది 2 లో




# ఇదీ సంగతి..!

- "నువ్వు అన్నావు కాబట్టి నేను అన్నాను" "నువ్వు చేస్తున్నావు కాబట్టి నేను అన్నాను"
- ఏ హిందువు ఎవరిని ఉద్దేశపూర్వకంగా దూషించడు..
- ఏ క్రైస్తవుడు ఎవరిని కావాలని నిందించడు
- ఏ ముస్లిం కూడా ఇతర మతాలపై ద్వేషాన్ని చూపడు
- తప్పు ఎక్కడ జరుగుతుంది..!?
- ఎవరు ప్రేరేపిస్తున్నారు? ఎవరు దోషులు?
- ఈ వారం జయభేరి ఎక్స్‌క్లూజివ్ గా అందిస్తున్న జయభేరి న్యూస్ సీనియర్ జర్నలిస్ట్ కదారి శ్రీనివాస్ వీకెండ్ స్టోరీ...

2 లో



# మాధాపూర్‌లో చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

- రెండు నెలల్లో పూర్తి చేయాలంటూ అధికారులకు ఆదేశం
- పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలంటూ హైడ్రా కమిషనర్ హితవు
- చెరువుల చెంత ప్రభుత్వ భూములుంటే స్వాధీనానికి సూచనలు

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 04:**
మాధాపూర్‌లోని తమ్మిడికుంటతో పాటు సున్నం చెరువులను హైడ్రా కమిషనర్

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేసీఆర్ క్యాంప్ ఆఫీసుపై దాడి

గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిని సబితా ఇంద్రారెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల కారణంగానే కాంగ్రెస్ కార్యకర్తలు ఇలా రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. మా దగ్గర కూడా కండలు తిరిగినవాళ్లు ఉన్నారంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలాంటి రౌడీ మాటలు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై పట్టపగలే దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. ఈ దాడికి పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

హరీశ్ రావు ఫైర్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు చెందిన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని, ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. "పట్టపగలే అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు బీహార్ గ్యాంగ్‌లను తలపిస్తోంది. ప్రజాప్రతినిధుల కార్యాలయాలపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా, లేనట్టా?" అని ప్రశ్నించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిందా? అని నిలదీశారు."ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రతిపక్షాల నోరు నొక్కుతూ, మరోవైపు తమ గూండాలతో దాడులు చేయించడమేనా ప్రజాపాలన? ఇందిరమ్మ రాజ్యం పేరుతో గూండా రాజ్యాన్ని అమలు చేస్తారా?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటూ, ఇక్కడి పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా అనే అనుమానం కలుగుతోందని అన్నారు.కాంగ్రెస్ అణచివేతలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆగకపోతే ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## ఉప్పల్ లో మ్యాచ్




రాచకొండ పోలీస్ కమిషనరేట్లు వెల్లడించాయి. సుమారు 39,000 మంది ప్రేక్షకులు వస్తారని అంచనా వేస్తున్నందున, ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈ చర్యలు తీసుకుంటున్నారు.ట్రాఫిక్ అడ్వైజరీ ప్రకారం, మ్యాచ్ జరిగే రోజుల్లో భారీ వాహనాలపై కఠిన ఆంక్షలు విధించారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మీదుగా మళ్లిస్తారు. ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు, ఎల్బీ నగర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను నాగోల్, బోడుప్పల్ వైపు దారి మళ్లిస్తారు. సాధారణ ప్రయాణికులు కూడా రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా దాదాపు 2వేల మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నారు. వీరిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, ప్రత్యేక బలగాలు, షీ టీమ్స్, బాంబ్ స్క్వాడ్ బృందాలు ఉన్నాయి. స్టేడియం పరిసరాల్లో 430 సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రేక్షకుల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను కేటాయించగా, స్టేడియం సమీపంలోని ప్రధాన రహదారులపై వాహనాలు నిలపడాన్ని పూర్తిగా నిషేధించారు.స్టేడియంలోకి ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, బయటి ఆహారం, సిగరెట్లు వంటి వస్తువులను అనుమతించబోమని పోలీసులు స్పష్టం చేశారు. మ్యాచ్ వీక్షించడానికి వచ్చేవారు వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో, ఆర్టీసీ బస్సుల వంటి ప్రజారవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

## అమరావతి పరుగులు పెట్టాల్సిందే..

భవనాల నిర్మాణంతో పాటు ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కేవలం భవనాలే కాకుండా భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా రోడ్ల నెట్‌వర్క్, హౌసింగ్ ప్రాజెక్టులు వేగంగా సాగాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పనిచేస్తున్నారని, వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే కీలకమైన పునాది పనులు పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణం అనేది కేవలం ఒక కాంట్రాక్ట్ పని కాదు, ఇది ఒక చారిత్రక బాధ్యత . ఈ అద్భుత నగరాన్ని నిర్మించే ప్రతి ఒక్కరూ చరిత్రలో భాగస్వాములు అవుతున్నారు అని ఉద్ఘాటించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, గ్రీన్ ఎనర్జీ ,అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి అమరావతిని ప్రపంచస్థాయి ఫ్యూచర్ సిటీ గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి వారం, నెలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఇటీవలే పార్లమెంటులో అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ చట్టబద్ధత కల్పించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తున్న తరుణంలో, 2027 నాటికి ప్రధాన పరిపాలనా భవనాలన్నీ సిద్ధం కావాలని అధికారులకు సూచించారు. అమరావతిని హైదరాబాద్ ప్లస్ నగరంగా, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## పబ్స్ పై ఈగల్ పంజా

నుండి వచ్చాయి? వీటి వెనుక ఉన్న నెట్‌వర్క్ ఏంటి? అనే కోణంలో విచారణను ముమ్మరం చేశారు.ఈ పార్టీకి టాలీవుడ్ సీనియర్ నటి హేమ కూడా హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలోనూ ఇలాంటి ఘటనల్లో ఆమె పేరు వినిపించడంతో, ఈసారి ఆమె స్వయంగా రంగంలోకి దిగి క్లారిటీ ఇచ్చారు. తానూ ఆ పబ్‌కు వెళ్లిన మాట వాస్తవమేనని, అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఈగిల్ అధికారులు తనకు కూడా డ్రగ్ టెస్ట్ నిర్వహించారని, తన యూరిన్ శాంపిల్స్ పరీక్షించిన తర్వాత రిజల్ట్ నెగటివ్ అని వచ్చిందని ఆమె వెల్లడించారు. తనపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టేందుకు హేమ ఇన్స్టాగ్రామ్ ద్వారా ఒక వీడియోను షేర్ చేశారు. అందులో ఈగిల్ అధికారులు తన శాంపిల్ సేకరించడం, టెస్టింగ్ కిట్‌లో రిజల్ట్ నెగటివ్ అని రావడం స్పష్టంగా కనిపిస్తోంది. నేను పబ్‌కు వెళ్లాను, అధికారులకు సహకరించాను, నా రిజల్ట్ నెగటివ్ వచ్చింది అని ఆమె నిర్మొహమాటంగా ప్రకటించారు. దీంతో డ్రగ్స్ కేసులో ఆమె చుట్టూ ముసురుకున్న వివాదానికి తాత్కాలికంగా తెరపడినట్లయింది. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన వారిలో ఓసివిల్ సర్వీస్ అధికారి కుమారుడు ఉన్నట్లుగా గుర్తించారు.

# ఇదీ సంగతి...!

### "నువ్వు అన్నావు కాబట్టే నేను అన్నాను" "నువ్వు చేస్తున్నావు కాబట్టే నేను అన్నాను"

- ఏ హిందువు ఎవరిని ఉద్దేశపూర్వకంగా దూషించడు..
- ఏ క్రైస్తవుడు ఎవరిని కావాలని నిందించడు
- ఏ ముస్లిం కూడా ఇతర మతాలపై ద్వేషాన్ని చూపడు....
- తప్పు ఎక్కడ జరుగుతుంది..!?
- ఎవరు ప్రేరేపిస్తున్నారు? ఎవరు దోషులు?
- ఈ వారం జయభేరి ఎక్స్ క్లూజివ్ గా అందిస్తున్న జయభేరి న్యూస్ సీనియర్ జర్నలిస్ట్ కడారి శ్రీనివాస్ వీకెండ్ స్టోరీ...



జయభేరి, హైదరాబాద్ :

ఒకప్పుడు ఆటవిక సమాజంలో మనుషులు జంతువులు కలిసి ఉండేవట.. అప్పుడు ఎవరు బలవంతులైతే వారికి బలహీనులు ఆహారంగా మారేవారు. అది ఆటవిక సమాజం. కానీ నేడు మనం ఉన్నది మానవ సమాజం. మానవ సమాజంలో మనుషులందరూ సమానమే అని అన్ని మత గ్రంథాలు బోధిస్తాయి. అది బోధనకే పనికొచ్చే విషయం కానీ నువ్వు నేను సమానం ఎట్లా? అనే సమాజంలో ప్రస్తుతం మనందరం బతుకీడుస్తున్నాం... జీవితంలో ఒక్కసారి అయినా నిజాన్ని నిక్కచ్చిగా చెప్పుకోవాలని ఉద్దేశంతో ఈ విషయం మీ అందరితో పంచుకుంటున్నా..

ఇక అసలు విషయానికొస్తే తెలంగాణ రాష్ట్రంలో కుల మత పంచాయితీ రచ్చకెక్కింది... అర్చకులుగా బ్రాహ్మణులే పేటెంట్ హక్కు తీసుకున్నారా అన్న మందకృష్ణ మాదిగ కాదు కాదండోయ్ పద్మశ్రీ... మంద కృష్ణ మాదిగ లేవనెత్తిన ఈ కులమత పంచాయితీ ఇప్పుడు అదే వేదికపై బ్రాహ్మణ సంఘాలు కూడా దుమ్మెత్తి పోసే పనిలో నిమగ్నం అయ్యాయి. బాగుంది "నువ్వు అన్నావు కాబట్టే నేను అన్నాను" "నువ్వు చేస్తున్నావు కాబట్టే నేను అన్నాను" అన్న సామెత కింద మారిపోతుంది ఈ పంచాయతీ. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న 14 సంవత్సరాల తర్వాత కూడా అభివృద్ధి సంక్షేమం ఉపాధి విద్య ఉద్యోగాలు ఈ విషయాలపై చర్చ జరగాల్సిన ఈ సమయంలో కులానికి మతానికి ఏదో కొంప మునిగిపోతున్నట్టు ఈ సమస్యను పుట్టించిన ఆ నేతలే ఒక్కసారి నేను సమాజానికి ఏం మేలు చేశాను అనే ప్రశ్న వేసుకుంటే సరిపోతుంది. కానీ అలా ఆలోచించరు. ఎందుకంటే ఆ సమాజాన్ని ఉద్ధరిస్తుంది తానే అని గొప్పలు చెప్పుకుంటూ సమాజంలో కులమత పంచాయితీ వాదాలను సున్నితమైన విషయాలను సమాజంలో విసురుతూ ఒకరి కొకరి మధ్య పచ్చగడ్డి వేస్తే అగ్గి రగులుకునే విధంగా ఇవ్వాలా ఏ నలుగురిలో చూసినా ఇదే విషయం ప్రజల నాలుకలలో మెదులుతుంది. ఇక సమాజానికి యువతకు ఉపయోగపడే విద్య వైద్యం ఉద్యోగం సంక్షేమం ప్రభుత్వ పాలన విధి విధానాలు ప్రభుత్వ పనితీరు ప్రభుత్వం ఎలా పని చేస్తుంది ఎలా అవినీతి చేస్తుంది అన్న విషయాలపై ఎవరు ఆలోచించకుండా ఇలాంటి పనికిమాలిన అవసరంలేని వాదోపవాదాలు గట్టిగా జరుగుతున్నాయి. అర్చకత్వంపై బ్రాహ్మణ సంఘాల నాయకులు ఫలానా గుడులలో అర్చకులుగా ఎవరున్నారో మీరు చూసుకోండి అంటూ విసిరిన సవాలు.. ఇవాళ తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేస్తున్నాయి. అసలు అర్చకత్వం మీ అక్క అంటూ ప్రశ్నించిన మాట కూడా సమాజాన్ని పూర్తిగా తనవైపు మలుపు తిప్పుకునే విధంగా ఆ మాటలు అగ్ని రగిలిస్తున్నాయి.. ఇక కొన్ని కొన్ని మీడియా ఛానల్లు పూర్తిగా రేటింగ్ పెట్టి వాళ్ళ టిఆర్పి పెంచుకోవడానికి బాగానే ఈ అంశం ఉపయోగపడింది. నిజానికి ఈ విషయంపై ప్రజలకు ఏమైనా కడుపునిండా విషయమా చెప్పండి. ఇలాంటి అనవసరమైన విషయాలను మాట్లాడుకోవడం ద్వారా నువ్వు అదేంటే నేను ఇది అన్నాను అన్న విధంగా సంభాషణ పూర్తిగా పరుష పదజాలంగా మారుతుంది.

**ఈ దేశం ఏమైపోతే నాకేంటి నేను నా పిల్లలు బాగుంటే చాలు అనుకునే రాజకీయ నాయకులు నేతలు ప్రజా సంఘాలు రైతు సంఘాలు కార్మిక సంఘాలు ఇలా చెప్పకుంటూ పోతే సమాజాన్ని ఉద్ధరించేది మేమే అంటూ చెప్పకొస్తున్న ఆ నేతలకి ఈ మాటలు వర్తిస్తాయి.. వందల సంవత్సరాల నుంచి కార్మిక చట్టాలు ఉన్న నాటి త్యాగదనులు చేసిన త్యాగాలనే నేటి నాయకులు వల్లిస్తున్నారు తప్ప... ఈనాటి సమాజం కోసం ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ఎన్నికల్లో నెగ్గడం కోసం ఎన్నో ఉచిత పథకాలు అందించడం ద్వారా ప్రజలు ఓట్లు వేస్తారని ఆశించి ఆ రీతిగానే అధికారాన్ని దక్కించుకుంటున్నారు. వాస్తవానికి సమాజంలో కులానికి మతానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా సమాజం అభివృద్ధిలో సంక్షేమంలో ఎలా ముందుకు పోవాలి అని ఆలోచిస్తే సమాజంలో ఇలాంటి రుగ్మత పూర్తిగా లేకుండా పోవడానికి అవకాశం ఉంటుంది. చదువుకున్న చదువు విజ్ఞానం పూర్తిగా యువతను పెడదోవ పెట్టిస్తున్నాయి.. తల్లిదండ్రుల మాటను పెడచెవిన పెడుతూ తమకు ఇష్టమైన రీతిగా తిరిగే యవ్వన పిల్లలను కూడా మనం చూస్తున్నాం...**




జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

వీరిని ప్రభావితం చేయడానికి నేటి రాజకీయ నాయకులు మతం పేరుతో పార్టీలను అంటగాగుతూ ప్రజలకు అంటురోగన్ల మానసికంగా వాళ్ళ మెదడులలో చేరిపోయేలా రాజకీయ పార్టీని మతానికి అంటగడుతూ పబ్బం గడుపుకుంటున్నారు.. అంతదాకా ఎందుకు? మేము ఎన్నో గుడ్లు కట్టించాం అని చెప్పుకుంటారే తప్ప ఇన్ని పాఠశాలలు కట్టించాం అని ఒక్కరు కూడా చెప్పుకోరే... మనిషికి కావలసింది అతి ముఖ్యమైనది బడి ఆ తరువాతే గుడి.. గుడి బడి రెండు అవసరమే కానీ బ్రతుకులు నడిపించేది బడి బ్రతుకును బానిస చేసేది గుడి.. ఈ వ్యత్యాసం తెలుసుకుంటే ప్రతి మనిషి మానవ వికాసానికి ఒకరికి ఒకరు సహాయపడతారు. అంతేకానీ నా కులం వాళ్లు ఆనాటి నుండి ఈనాటి వరకు అదే పని చేస్తున్నారు మేము ఆ పని కోసమే పుట్టామా అంటూ ఈనాడు నాటి విషయాలను వల్లిస్తూ తమ జాతిని తామేకించపరుస్తూ రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని మాట్లాడడం ఎంతవరకు సమంజసం? నా కులం పెద్దది అంటే కాదు కాదు నా మతం గొప్పది అని చెప్పుకొచ్చే ప్రతి వారు కావాలని వేరే ఇతర కులాలను మతాలను దూషించరు. ఒకవేళ అలా దూషించిన వారిని చట్ట ప్రకారంగా శిక్షిస్తూ ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. అలా కోర్టులు శిక్షలు విధిస్తున్నాయా.. ఇప్పటికీ కులం పేరుతో దూషించిన చరిత్రలు మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి వారిని ఉసిగొలిపే రాజకీయ రాబందులు ఎవరు? వారిని పెంచి పోషించే దుర్మార్గులు ఎవరో? ఇలాంటి విషయాలపై ప్రజలు ఎందుకు ఆలోచించరు.

**పురాణాలు ఇతిహాసాలు వేదాలు ఉపనిషత్తులు ఎన్నో కులాలు లేవు అంటూ గోశిస్తున్న ఇంకా ఈ కులం గోల, మతం అంటూ వ్యాధి ఎందుకు ప్రజల్లో వ్యాపిస్తుంది... ఈ రెండు మనిషిని ఆరోగ్యంగా ఉన్న మరణానికి దగ్గర తీసే వ్యాధుల్లో మారిపోతున్నాయి.. సామాజిక రుగ్మత సమసమాజ స్థాపన కోసం నాటి నాయకుల నుంచి ఆధ్యాత్మిక విప్లవాన్ని పుట్టించిన ఎంతోమంది వారి ఆలోచనలో నుంచి ఎందుకు ఈ ప్రజలు ఆలోచించరు. ఆ దిశగా తమ మతాన్ని కులాన్నో నడిపిస్తూ సమసమాజ స్థాపనకు ఎందుకు చిత్తశుద్ధిగా కృషి చేయరు.. ఎవరికి వారు తమ స్వార్ధ లాభాల కోసం వ్యాపారాలని రాజకీయాలను సినిమాలను ప్రజలకు ఉపయోగపడని అన్ని రకాల వ్యాపారాలను అంటగడుతూ వాటి మధ్యన కులమత రాజకీయాలను వల్లిస్తూ నిప్పు పెట్టే నేతలకు వత్తాసు పలుకుతున్న ఆ రాజకీయ రాక్షసులు ఎవరో ప్రజలకు తెలియదా..!?**

నీది ఆ కులం నాది ఈ మతం నువ్వు నేను ఎలా సమానం అంటూ మాట్లాడుతున్న అలాంటి మానవారణ్యాల్లో ఉన్న వారిని ఆటవిక న్యాయం వారికి పరిచయం చేయాలి. అది ఒకరితోనో ఇద్దరితోనో కాదు ప్రజలందరూ సంఘటితంగా పోరాడాలి.. వేదాలు పూర్తిగా ఏ కులాలు లేవని ఘోషిస్తున్న ఇంకా ఈ కులాన్ని మోసుకొచ్చే రాజకీయ రాబందులకు వత్తాసు పలికే నేతలను ప్రజలు ఎక్కడికి అక్కడ సమాధి చేయాలి. వారు మాట్లాడుతున్న మాటలను వారు సమాజంలో రగిలిస్తున్న నిప్పును ఆర్పి వేసే పద్ధతిలో ప్రజలు విజ్ఞులై మెలగాలి... ఈ దేశంలో పుట్టిన నువ్వు నేను మనందరం మానవా అరణ్యంలో సంచరిస్తున్న సజీవ సాక్షులం.. ఆటవిక న్యాయం కంటే మానవ నీతి మైల పడిపోతున్న ఈ రోజుల్లో ఇకనైనా మారుదాం మనిషిగా బ్రతుకునిద్దాం.. నలుగురికి వీలైనంత బ్రతుకును పంచుదాం..

## చెరువులను పరిశీలించిన హైడ్రా

ఏవీ రంగనాథ్ శనివారం పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. అధికారులతో సమీక్షించారు. రెండు నెలల్లో చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా తమ్మిడికుంటను పరిశీలించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం సందర్శించారు. ఐటీ కేంద్రానికి చేరువుగా ఉన్న తమ్మిడికుంటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా.. ఇక్కడకు వస్తే ఒత్తిడి కూడా దూరమమయ్యేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన విషయాన్ని చెరువు అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న అధికారులకు కమిషనర్ చెప్పారు. చెరువు చుట్టూ పచ్చదనం నిండుగా కనిపించాలని సూచించారు. బయట కంటే చెరువు చెంత 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. చెరువు చుట్టూ పాత్‌వేలు, కూర్చొని సేద దీరేందుకు వీలుగా సీటింగ్ వ్యవస్థ, పార్కులు, పచ్చిక బైళ్లు.. ఉండేలా చూడాలన్నారు.

చెరువుల చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల గురించి పూర్తి స్థాయిలో విచారించి.. వాటిని స్వాధీనం చేసుకుని చెరువు అభివృద్ధిలో భాగం చేయాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. ఆక్రమణదారుల పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సున్నం చెరువు చెంత సర్వే నంబరు 30, 31కి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని.. ప్రభుత్వ భూమి ఉంటే అంగుళం కూడా పోకుండా సెక్యూర్ చేయాలన్నారు. ఈ రెండు సర్వే నంబర్ల మధ్య ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా.. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంట చెరువుకు పై భాగంలో కింది భాగంలో ఉన్న ప్రభుత్వ భూములను తమదిగా క్లైమ్ చేస్తున్న వారి పత్రాలను పరిశీలించాలన్నీరు. తమ్మిడికుంట చెరువును ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతుంటే.. పై భాగంలో వేస్తున్న చెత్త, వ్యర్థాల వల్ల మళ్లీ నీరు కలుషితమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు.

సున్నం చెరువు చెంతన ఉన్న బోరబండ బస్తీ, ఎన్ ఆర్ ఆర్ పురం నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువులోకి కలిసేలా ఇన్‌లెట్లను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. వరద నీరు చెరువులోకి చేరేలా.. మురుగు నీరు కిందకు పోయేలా డైవర్ట్ కాలువ నిర్మాణం కూడా పూర్తయ్యిందని.. త్వరలో అనుసంధానం చేయాల్సి ఉందని అధికారులు ఈ సందర్భంగా కమిషనర్‌కు వివరించారు. అయితే ఈ అనుసంధానం జరగకపోవడంతో సున్నం చెరువు రోడ్డు నుంచి బస్తీలోకి వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారిందని.. ఇక్కడ పైపులైన్లు వేసి మురుగు సాఫీగా సాగేలా చూడాలని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా.. రెండు రోజుల్లో మున్సిపల్ అధికారులతో కలిసి వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. సున్నం చెరువును ఆనుకుని వెళ్తున్న హైటెన్షన్ వైర్ల కింద ఆక్రమణలను తొలగించి.. రహదారి విస్తరణపై చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## రాములమ్మ శాపనార్థాలు

సున్నితంగా ఉన్నాయన్న వాదన వినిపించింది. ఇక, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీలో గుసగుస మొదలైంది. ఆమె లేవనెత్తిన అంశాలపై ఎవరూ విభేదించకపోయినా.. ఆమె తీరును మాత్రం కొందరు తప్పు బడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా.. బీఆర్ఎస్ వంటి ప్రత్యర్థి పార్టీలకు ఊతమిచ్చేలా ఆమె వ్యాఖ్యానించారని ఓ మంత్రి ఆఫ్ దిరికార్డుగా అన్నారు. ఇదే మాట మరికొందరు కూడా చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. విజయశాంతి ప్రకటనలకే పరిమితం అయ్యారని అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు.. ఇప్పుడు సొంత పార్టీ ప్రభుత్వం ఎన్నో అమలు చేస్తోందని.. కానీ, విజయశాంతికి అవేవీ కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం పింఛన్లు ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కానీ.. విజయశాంతి ప్రత్యేక ఎజెండా పెట్టుకుని మాట్లాడారని.. ఒక వర్గాన్ని రెచ్చగొట్టే ధోరణి కనిపించిందని మెజారిటీ నాయకులు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ.. రాములమ్మ ప్రత్యేక శైలిని అవలంభిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రస్థాయి నాయకుల కంటే కూడా ఆమె జాతీయ స్థాయి నాయకులతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. అంతేకాదు.. రాష్ట్ర ప్రభుత్వ పనిలోనూ ఆమె భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొన్ని కొన్నిసందర్భాల్లో అసలు లేనే లేదన్న వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజులుగా విజయశాంతి వ్యవహారంపై పార్టీలో చర్చసాగుతోంది.

**రేసులో మహేశ్ గౌడ్, విజయశాంతి, రాజగోపాల్..**

రెండు బెర్తులనే ఫిలప్ చేస్తే.. ఆశావహులను ఎలా సంతృప్తి పరుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి అమాత్య యోగం కోసం గట్టి పట్టుబడుతున్నారు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, బీర్ల అయిలయ్య వంటి వారు పోటీ పడుతున్నారు. విజయశాంతి పేరు కూడా రేసులో ప్రధానంగా వినిపిస్తోంది. అయితే రెండు బెర్తుల కోసం అరడజను మంది ఆశావహులు సీరియస్‌గా ట్రై చేస్తుండటంతో ఎవరికి అవకాశం కల్పిస్తారనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులపై అటు రాములమ్మకు.. ఇటు రాజన్న బోలెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఈ ఇద్దరిది స్పెషల్ కాంబినేషన్. మనుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి. ఈ ఇద్దరి కల, ఆశ ఒకటే. అదే క్యాబినెట్ మినిస్టర్. అయితే అమాత్య యోగం కోసం వెయిటింగ్‌లో ఉన్న వీళ్లిద్దరు..తమకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలోనే సమయం సందర్భం దొరికినప్పుడుల్లా సొంత ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా కామెంట్స్ చేస్తున్నారు. ఈ మధ్యే అటు మండలిలో రాములమ్మ, ఇటు అసెంబ్లీ రాజగోపాల్‌రెడ్డి చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయన్న చర్చ నడుస్తోంది. వారి అసంతృప్తి చల్లార్చేందుకు హస్తం పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. రాజగోపాల్‌రెడ్డికి అధిష్టానమే హామీ ఇచ్చి ఉండటంతో ఆయనకు బెర్త్ పక్కా అంటున్నారు. ఇక లేడీ ఫైర్ బ్రాండ్‌గా.. బీఆర్ఎస్‌పై బాణాలు ఎక్కు పెట్టాలంటే రాములమ్మకు మంత్రివర్గంలోకి తీసుకుంటే బాగుంటుందన్న చర్చ జరుగుతోందట. ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తికావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తుల భర్తీపై ఫోకస్ పెట్టింది. అయితే విప్‌లుగా పని చేస్తున్న వారు ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా.. మరో ఇద్దరు కూడా అమాత్య యోగం కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గం నుంచి ఆది శ్రీనివాస్.. యాదవ సామాజిక వర్గం నుంచి బీర్ల అయిలయ్య తనకు క్యాబినెట్‌లో చోటు కల్పించాలని కోరుతున్నారు. అయితే విస్తరణకే పరిమితం అయితే మాత్రం ఈ ఇద్దరి ఆశలు నెరవేరుతాయో లేదోనన్న డైలమా కంటిన్యూ అవుతోంది. క్యాబినెట్ విస్తరణతో పాటు షఫ్లింగ్ చేస్తే మాత్రం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యకు ప్రమోషన్ దక్కే చాన్సెస్ ఎక్కువగా ఉన్నాయంటున్నారు. అదే జరిగితే ఇప్పటికే క్యాబినెట్‌లో ఉన్నవారిలో ఎవరికి ఉద్వాసన పలుకుతారన్నది మరో చర్చ. క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్‌తోనే సరిపెడుతారా? లేక ప్రక్షాళన చేస్తారా అనేది చూడాలి.

# ఉద్యోగం కంటే లంచాలే మేలు..
# కాప్రా అంటేనే కమిషన్ల దందా..!?

ఉద్యోగం కంటే లంచాలు పుచ్చుకోవడమే మేలుకున్నారో ఏమో కాప్రా మున్సిపాలిటీ అధికారులు. అక్రమ నిర్మాణాలు కూల్చివేతలో వీళ్ళ నిర్లక్ష్యం పూర్తిగా బయటపడుతుంది. అక్రమ నిర్మాణాల జోరు చర్లపల్లి ప్రాంతంలో ఈ వ్యవహారం బట్ట బయలు అవుతుంది. జయభేరి న్యూస్ ఎన్నోసార్లు నిఘా పెట్టి ఆధారాలు బయటపెట్టిన కోర్టు మెట్లు ఎక్కిన తర్వాతే తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అసమర్ధ పనితీరుపై తీవ్రమైన అనుమానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన ఆ భవనాలపై చర్యలు తీసుకోవలసిన అధికారులే పూర్తిగా బాధ్యత మరిచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఆ నోట ఈ నోట బహిరంగ రహస్యంగా మారుతున్నాయి. చర్యలు తీసుకోమంటే అధికారులు మాత్రం గోడలకు రంధ్రాలే వేశారు గాని కిటికీలు తీయకుండా కనీసం తూతూ మంత్రంగా చేశారని స్థానికులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంత ప్రేమను వలకపొస్తున్న అధికారులకు ఎంత లంచాలు పుట్టాయో కదా అంటూ ఆ నోటా ఈ నోట పెదవి కొరు క్కుంటున్నారు.. ఎంతైనా లంచాలు బుక్కిన కోళ్లు బలిసినంతగా మేసిన కోళ్లు ఉండవు కదా...

- ఎన్నిసార్లు సీజ్ తొలగించినప్పటికీ అధికారులు కేసు నమోదు చేయరు
- జయభేరి న్యూస్ కథనం మేరకు కదిలిన అధికారులు
- ఎంఎంసి కమిషనర్ చర్యలు తీసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- తూతూ మంత్రంగానే గోడలకు రంధ్రాలు కిటికీలు మరిచారు
- చీ.. చీ.. అంటున్న జనాలు

**జయభేరి, కాప్రా :**

కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వంద్వ వైఖరి బహిర్గతం అయ్యింది. చేసే ఉద్యోగం కంటే లంచాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న వాస్తవం అక్రమ నిర్మాణం కూల్చివేతలు తేటతెల్లమయింది. చర్లపల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత వ్యవహారం మరోసారి కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారులే పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కూల్చివేత పేరుతో నామమాత్రంగా గోడలకు రంధ్రాలు వేయడం కిటికీలు తీయడం చేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.







### అమ్మో కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలానా..?

చర్లపల్లిలో రహదారిపై 1) కాప్రా సర్కిల్ 1, చర్లపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, సర్వే నెంబర్ 190, ప్లాట్ నెంబర్ 24, పునీతు రామ్, సన్ ఆఫ్ మోతీ రామ్, 277 sq. Yds స్థలంలో భవనం నిర్మాణానికి వన్ స్టిల్ పార్కింగ్ + 2 రెసిడెన్షియల్ నిర్మాణం. 2) కాప్రా సర్కిల్ 1, చర్లపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, సర్వే నెంబర్ 190, ప్లాట్ నెంబర్ 25, సెంచ ముఖేష్ చౌదరి, సన్ ఆఫ్ మూలరాం చౌదరి, 277 sq. Yds స్థలంలో భవనం నిర్మాణానికి వన్ స్టిల్ పార్కింగ్ + 2 రెసిడెన్షియల్ నిర్మాణం. రెండు పేర్లతో వన్ స్టిల్ పార్కింగ్ + 2 అంతస్తులకు రెసిడెన్షియల్ అనుమతి తీసుకున్నారు. అక్రమంగా నిర్మించిన భవనంపై అధికారులు రెండుసార్లు సీజ్ చేసినట్లు తెలిపారు. వాస్తవానికి అది కేవలం పైపై చర్యగానే మిగిలిందని తిరిగి యధావిధిగా నిర్మాణం జరుగుతుంటేఒక్క అధికారి కూడా ఇటువైపు చూడకపోవడం వెనుక మామూలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనం పూర్తిగా కూల్చివేయాల్సిన చోట కొన్ని గోడలకు చిన్న రంధ్రాలు వేసి వదిలివేయడం, కిటికీలు తీయడం మాత్రమే తొలగించి, మిగతా నిర్మాణాన్ని అలాగే వదిలేయడం అధికారుల నిజమైన అవినీతి ఉద్దేశ్యం తెలిసిందని స్థానికులు పేర్కొంటున్నారు. అనేక పత్రికల్లో వరుస కథనాలు వెలువడిన తర్వాతే అధికారులు కదిలారని అదేవిధంగా "హై కోర్టులో కంటెంట్ పిటిషన్" పై విచారణ ఉండడంతో తప్పని పరిస్థితుల్లో తూతూ మంత్రంగా కూల్చినట్లు ప్రజలు చెబుతున్నారు. అయితే హైకోర్టులో ఉన్న ఈ అక్రమ నిర్మాణానికి అసెస్మెంట్ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి అక్రమ నిర్మాణానికి ఇలా అసెస్మెంట్ చేశారో అవినీతి అధికారులకే తెలియాలి. మామూళ్లు తీసుకున్నాకే ఈ విధంగా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు అంటూ స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి పెచ్చరిల్లిందని, మున్సిపల్ నియమ నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కాప్రా సర్కిల్ కు వచ్చినప్పటినుండి భారీగా అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తూ లంచాలే పరమ అవధిగా ఉద్యోగం చేస్తున్నట్లు, ప్రైవేటు వ్యక్తులను పెట్టుకొని మరీ దోపిడీకి తెగబడ్డ తీరుపై తోటి ఉద్యోగులు సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ఆయన అనుమతి లేకుండా ఏ ఒక్క అక్రమ నిర్మాణం కూడా జరగవని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు పేదలు ఇల్లు నిర్మిస్తే చిన్నపాటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు భారీ అక్రమ నిర్మాణాలపై మౌనం వహించడం అధికారుల ద్వంద్వ వైఖరిని స్పష్టంగా చూపుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. జోనల్ కమిషనర్ స్థాయిలో ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది.

### అధికారుల అవినీతి తగ్గేనా.?

కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఆరోపణల్లో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కఠినంగా వ్యవహరించాలని చర్లపల్లిలో జరిగిన ఈ అక్రమ నిర్మాణమే ఒక ఉదాహరణ మాత్రమే. పట్టణ అభివృద్ధి పేరుతో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాలంటే అధికారుల నిజాయితీ కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం. లేదంటే ప్రభుత్వ ఉద్యోగం కంటే అవినీతికే అధికారుల ప్రాధాన్యత అన్న ప్రజల అభిప్రాయం మరింత బలపడే ప్రమాదం ఉంది. కాబట్టి కమిషనర్ కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.







## జహంగీర్ కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 04 :**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ గాయకుడు ఎండీ జహంగీర్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని జిల్లా బిజెపి అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన కుటుంబం ప్రస్తుత ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే జహంగీర్ కుమారుడికి తెలంగాణ సాహితి అకాడమీలో ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో మరణించిన తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను కూడా ప్రభుత్వం గుర్తించి వారికి తగిన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు యాట పెంటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, ఆకుల రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, గొర్ల రామచంద్రం, మోత్కుపల్లి బిక్షపతి, గుండెబోయిన మల్లేశం పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 04 :**

తుర్కపల్లి మండలం పెద్దతండ, చౌక్లా తండా గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి భూక్య రాజారాం నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు, ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలను ఇప్పించాలని అన్నారు. గ్రామంలో 180 పశువులకు టీకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, ఎల్ఎస్ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు శంషుద్దీన్, రాఘవేందర్, బైఫ్ ప్రవీణ్, గోపాలమిత్రలు బాలేష్, వీరు, ప్రవీణ్, ఉపసర్పంచ్ భూక్య కిషన్ నాయక్, వార్డు సభ్యులు చందర్ నాయక్, భూక్య మధు నాయక్, భూక్య పిక్లా నాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.. పరమేష్ యాదవ్



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 04 :**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు క్యాంపు కార్యాలయం మీద చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ యాదవ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు అన్నారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిలో పోటీ పడాలని, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై దాడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటి శ్రీశైలం, నాయకులు రాజేష్ నాయక్ కనకరాజు, కల్లూరి శ్రీనాథ్, బబ్బురి వెంకటేష్, షాదుల్లా, బాలరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో కలలు సాకారం

- తుంకుంట అంక్షరెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 4:**

పేదల ముఖాల్లో చిరునవ్వే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం అని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తుంకుంట అంక్షరెడ్డి అన్నారు. తునికి బొల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం పాటుపడే ప్రభుత్వం అని, , అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అని వారు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కల సాకారం అవుతుందని వెల్లడించారు. అనంతరం అంక్షరెడ్డిని పలువురు లబ్ధిదారులు ఆలింగనం చేసుకుంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్నగారి ముత్యం రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు అవకతవకలు వెలుగులోకి

**జయభేరి, ఉప్పల్ :**

హైదరాబాద్‌లోని ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది హాజరులో లోపాలు, సిటిజన్ ఛార్టర్ లేకపోవడం, ఆర్టీఐ బోర్డు దెబ్బతినడం వంటి పలు అవకతవకలు బయటపడ్డాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు, నియమావళి ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రజలు అనుమానాస్పద అంశాలను 14432కు ఫోన్ చేసి సమాచారం అందించాలని విజిలెన్స్ అధికారులు కోరారు. ఈ సంఘటన ఉప్పల్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో కలకలం రేపింది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటున్న కౌన్సిలర్ గాదె వెంకటేష్

- సొంత నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న కౌన్సిలర్..
- సంతోషం వ్యక్తం చేస్తున్న కాలని వాసులు

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 4:**



అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7 వార్డులో సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్ళి ప్రజల మన్నలలను పొందుతున్నారు కౌన్సిలర్ గాదె వెంకటేష్.. ప్రజా సమస్యలే ప్రధాన అంజెడగా సుడిగాలి పర్యటన చేస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇక 7వ వార్డులో గత కొంత కాలంగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కాలని వాసులు అవస్థలు గుర్తించి తన సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీరుస్తున్నారు.

దీంతో కాలనీలో విద్యుత్ సరఫరా కావడంతో కాలనీ ప్రజల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.

ఈ సందర్భంగా కౌన్సిలర్ గాదె వెంకటేష్ ను కాలనీ వాసులు పొగడ్లతో ముంచెత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమస్య ఏదైనా సరే తన దృష్టికి తీసుకురావాలని సాధ్యమైనంత త్వరగా ఆ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడమే లక్ష్యం

- **మున్సిపల్ చైర్మన్ జాం రవి**

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 4:**

మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని అద్రాస్ పల్లిలో 22, 23 వార్డుల్లో కౌన్సిలర్లు ఆది అజయ్ కుమార్, పులి ప్రభాకర్ ల అధ్యక్షతన ప్రజా పాలన ప్రజల భాగస్వామ్యం మరియు ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులచే అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ పవన్ కుమార్ లు హాజరయ్యారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మరియు సమస్యల పరిష్కారంపై చర్చించారు. అదేవిధంగా సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత పెంపు , రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి పథకం, కల్యాణలక్ష్మి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం , దివ్యాంగులైన విద్యార్థులకు వాహనాల పంపిణీ మరియు ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ హర్షద్, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, మాజీ సర్పంచ్ లు, వార్డు సభ్యులు, మహిళంసంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కలియుగ దైవం శ్రీవేకటేశ్వర స్వామి భక్తులకు సమాధానము చెప్పాలి



**జయభేరి, పరవాడ:**

తిరుమల పవిత్ర కాపాడలంటే టి టి డి చైర్మన్ బి ఆర్ నాయుడును తక్షణమే తొలగించాలని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ,వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.పెందుర్తి వెంకటాద్రి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన వై.సి.పి నాయకులు వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు ,మాన్యం జిల్లాల పరిశీలకులు శరగడం చిన అప్పలనాయుడు, వై.సి.పి ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దేవాలయం ముందు ప్లకార్డులతో బి ఆర్ నాయుడు ను తక్షణమే రాజీనామా చెయ్యాలని నినాదాలు చేసారు.టి టి డి చైర్మన్ బి ఆర్ నాయుడు రాసాలీలలు సోషల్ మీడియాలో బహిర్గతం అయిన కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని సనాతన ధర్మం అని ప్రచారం చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం తప్పులు చేసిన బి ఆర్ నాయుడు పై ఎందుకు చర్యలు తీసుకోలేదని వెంటనే టీటీడీ చైర్మన్గా బి ఆర్ నాయుడుని తొలిగించాలని వారు నినాదాలు చేసారు.

## పరవాడ టూ లంకెలపాలెం రహదారిలో అదుపుతప్పిన లారీ



**జయభేరి, పరవాడ:**

పరవాడ మీదగా లంకెలపాలెం రహదారి వెబండి వెళుతున్న బొగ్గు లారీ అదుపు తప్పి డివేడర్ మీదగా చెట్టుని డికొట్టింది.వివరాల్లోకి వెళ్ళితే శుక్రవారం తెల్లవారుజామున పరవాడ మీదగా లంకెలపాలెం రహదారి ప్రయాణం చేస్తున్న బొగ్గు లారీ డ్రైవర్ నిద్రఅవస్థ వలన లారీ అదుపు తప్పి డివైడర్ దాటి అటు వైపుగా వెళ్లి చెట్టుని డికొట్టింది. ఆ సమయంలో అటుగా ఎవి ప్రయాణం చెయ్యకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

## పేకాట రాయుళ్ళు పై పోలీస్ శాఖ డ్రోన్లతో ఆకస్మిక దాడులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ సిఐ ఆర్ మల్లికార్జున రావు వారి సిబ్బందితో కలిసి పరవాడ మండలం దేశపాత్రునిపాలెం గ్రామం శివారులో ఉన్న ఒక ఇంటిలో గేమింగ్ పై శనివారం డ్రోన్ సాయంతో ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి టెర్రస్ పై గదిలో పేకాట ఆడుతూ ఉన్న 6 మందిని పట్టుకొని వారి వద్ద నుండి రూ. 8,500 నగదు, మొబైల్ ఫోన్లు మరియు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా అక్రమ గేమింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రజలు సహకరించాలని పోలీసులు సూచించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

# కోతుల బెడద తీరేదెప్పుడు..?


- **యాదగిరిగుట్టలో రోజురోజుకు పెరుగుతున్న కోతులు ఇళ్లు,ప్రజలపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం**
- **ప్రతి ఇళ్లలో నుండి బయటకు వచ్చేందుకు వణికిపోతున్న ప్రజలు తూతూ మంత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు**
- **ఇప్పటికైనా నియంత్రించాలంటూ ప్రజల వేడుకోలు**

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 04 :**

యాదగిరిగుట్టలో కోతుల బెడద ఎప్పుడు తీరుతుందో అర్థం కాని పరిస్థితి దాపురించింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల దగ్గర నుండి స్థానిక ప్రజలకు కోతులను చూసి వణికిపోతున్నారు. కొంత కాలంగా యాదగిరిగుట్టలో కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది గానీ తగ్గడం లేదు.ఉదయం,రాత్రి అనే తేడా లేకుండా కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లపై దాడులు చేస్తూ ఏది దొరికితే వాటిని అందుకొని వెళ్లడమే కాకుండా ప్రజలపై దాడికి యత్నిస్తున్నాయి. పాదాచారులు, వాహనదారులు ,ఇతరులు ఏదైనా తినుబండారాలు కానీ, వస్తువులు గానీ తీసుకెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రాలేక బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు. చిన్నారులు,స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు రోడ్లపైకి వస్తే దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే వ్యాణిజ్య వ్యాపారాలు సరిగా నడవక వ్యాపారులు ఇబ్బందులు పడుతుంటే



**కొత్త పాలక మండలి దృష్టి సారించాలి :**



కోతుల బెడదపై మున్సిపల్ పాలక మండలి దృష్టి సారించాలని,వాటిని నియంత్రించి ప్రజలు స్వేచ్ఛగా రోడ్లపై తిరిగేలా చేయాలని కోరుతున్నాం.

**- కన్నప, స్థానికుడు, యాదగిరిగుట్ట**

కోతులు అందినకాడికి దోచుకొని వెళ్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఈ విషయంపై ఫిర్యాదు చేసినా తూతూ మంత్రపు చర్యలతో చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొనాలని, కొత్త పాలక మండలి ఏర్పడ్డ నేపథ్యంలో కనీసం పాలక మండలి సభ్యులపై ఈ సమస్యపై దృష్టి సారించి గతంలో లాగా తూతూ మంత్రపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపి తమ ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు.

**చర్యలు తీసుకోవాలి :**



యాదగిరిగుట్టలో రోజురోజుకు కోతుల బెడద ఎక్కువతుంది. ఇలానే ఉంటే ప్రజల కన్నా వాటి సంఖ్య ఎక్కువై ప్రజలకు రక్షణ లేకుండా పోతుంది. కాబట్టి వెంటనే కోతులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**- మహేందర్, స్థానికుడు, యాదగిరిగుట్ట**

**అధికారులు నిద్ర లేవాలి :**



యాదగిరిగుట్ట పట్టణంలో కోతుల సమస్య అధికారులకు తెలియనిది కాదు.కానీ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు నిద్రలేని కోతుల సమస్యలను తీర్చాలి.

**- వేణు శివరాం, స్థానికుడు, యాదగిరిగుట్ట**

## కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ ఘనంగా జన్మదిన వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. తన జన్మదినం రోజున యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర సింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి రావడం, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 11వ వార్డు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు11వ వార్డులో నగదు రూపేనా కళ్యాణ కానుకను ఇదే రోజు ప్రారంభించడం, మూడు శుభ అంశాలు ఒకేరోజు కలిసి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని



అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారి చల్లని చూపులతో పాటు తన వార్డు ప్రజల ఆశీస్సులతో కౌన్సిలర్ గా విజయం సాధించిన తాను తన 11 వ వార్డును అభివృద్ధి కార్యక్రమాలతో తీర్చిదిద్దుతానని,ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులైన వారికి అందజేస్తానని అన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదినం జరుపుకున్న11వ వార్డు కౌన్సిలర్ మల్లేష్ యాదవ్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్,వైస్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లు అందరూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, 11వ వార్డుప్రజలు, బంధువులు, అభిమానులు,రాజీవ్ యూత్ సభ్యులు ఈ సందర్భంగా శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. 11వ వార్డు కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో గుండ్లపల్లి భరత్ గౌడ్, బరిగె రాంచందర్, సాధునేని మధుకర్, బంధారపు బిక్షపతి,సుడుగు శ్రీనివాస్ రెడ్డి, ఎరుకుల హేమేందర్, మొలుగు నరసింహ,రాజ్ కోటి, కోనపురం రాజు, సలాం, బాస్కర్, కిషోర్,కోల కృష్ణ ,సుధగాని గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం తాళ్లగడ్డ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు నారాయణ గౌడ్, యాదయ్య గౌడ్, రమేష్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు గౌడ్, రమేష్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, ఆంజనేయులు గౌడ్ సత్యం గౌడ్ ,సురేంద్రమ్మ, నీలమ్మ లతో పాటు బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గం లో ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు అండగా కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్

- **గోపన్ పల్లి ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థులకు బ్యాగుల పంపిణీ**

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గోపన్ పల్లి లో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్ అండగా నిలుస్తుంది. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు ఫౌండేషన్ నిర్వాహకులు కోట్ల రాందేవ్ రెడ్డి స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్ నిర్వాహకులు రాందేవ్ రెడ్డి, రాధా రాందేవ్ రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శి చందన, సర్పంచ్ బాల్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హఖ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వల్లభ రెడ్డి, వార్డు సభ్యులు కుమ్మరి బుచ్చన్న, ఉప్పరి రమేష్, వడ్డే ప్రసాద్ లతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మన్యంకొండలో ఘనంగా తిరుచ్చి సేవ

- **అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు**

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవా పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుండి శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకోవచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురుల మధ్య స్వామి వారి ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా మండపంలో స్వామివారికి దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన శివర్ల నర్సింహా పద్మ కుమారుడు శివ శిరీష వివాహ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ , కంకణాల వెంకట్ రెడ్డి లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, తిరుమణి పాపయ్య,దాసరి తిరుపతయ్య, కాయితి బచ్చిరెడ్డి, మర్రు శ్రీనివాసరావు, మర్రు జనార్ధన్ రావు, మర్రు రంగారావు, రెడ్డి పరమేష్, బొడ్డు యాదగిరి, మొరుపోజు రాజు, దాసరి వెంకటయ్య, దాసరి ముత్తయ్య, రెడ్డి గాలయ్య, బోడ్డు సంతోష్, మునగాల అశోక్, సందె దేవయ్య, సందె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రజల పాలిట శనీశ్వరుడు హరీష్ రావు

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ధ్వజం
- జిల్లా నాయకులతో పాలమూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**




పాలమూరు ప్రజల పాలిట హరీష్‌రావు శనీశ్వరుడిగా దాపరించారని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ధ్వజమెత్తారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాజీమంత్రి హరీష్‌రావు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై చేసిన ఆరోపణలను ఖండిస్తూ శనివారం పాలమూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్ రావు పై తీవ్రస్థాయిలో ఆయన విరుచుకుపడ్డారు. కొడంగల్ కు విహారయాత్రకు వచ్చిన మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి పోయారన్నారు.

అబద్ధాల పునాదులపై పుట్టి ఆరు గ్యారెంటీలపై అసత్య ప్రచారం చేస్తున్నారని హరీష్ రావు మాటలను ఖండించారు.పదేళ్లు బీ ఆర్ యస్ అధికారంలో ఉండి చేసిన మోసాలు దోపిడీలు యావత్ రాష్ట్ర ప్రజానీకానికి తెలుసన్నారు. వారిలాగా మేము మోసం చేసే వ్యక్తులం కాదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, 500కే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం, రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఇచ్చిన మాట మేరకు 22 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామన్నారు.

బీఆర్ యస్ మాదిరిగా ఇంటికో ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి, కేజీ టు పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్ రూమ్ ల పేరిట ప్రజలను మోసం చేయలేదన్నారు.మీరు రుణమాఫీ చేస్తామని నాలుగేళ్లు రైతులను మోసం చేసి, ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తే, మీరు చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని విమర్శించారు. 2016లో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధించి 2017 లో డిపిఆర్ సమర్పించిన మీరు అధికారంలో ఉన్న చివరి రోజు నాటికి కూడా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు డిపిఆర్ ఎందుకు సమర్పించలేదని ఆయన ప్రశ్నించారు. 28 వేల కోట్ల అంచనా తో ప్రారంభమైన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నేడు 84 వేల కోట్లకు పెరిగిందన్నారు. జూరాలను సోర్స్ ను వరద నీటిని వాడుకుంటే రోజు 3 టిఎంసిల చొప్పున 35 రోజులపాటు 90 టీఎంసీల వరకు నీటిని తరలించే అవకాశం ఉండేది.

గ్రావిటీ ద్వారా నీళ్లు తీసుకునే వెసులబాటు ఉండేదన్నారు. 28 వేల కోట్ల ఖర్చుతో మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. పది లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే అవకాశం దక్కేదన్నారు. కానీ మీరు సోర్సును శ్రీశైలంకి మార్చడం ద్వారా రోజు తరలించే నీటిని కెపాసిటీ 1.5 టిఎంసిలకు తగ్గిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. కింది నుంచి 245 మీటర్ల ఎత్తు నుంచి నీటిని ఎత్తిపోవాల్సి వస్తుందన్నారు. దీని ద్వారా ఎత్తు అదనంగా 100 మీటర్లు పెరిగిందన్నారు. దాని ద్వారా ఇప్పుడు ప్రాజెక్టు అంచనా వ్యయం 84 వేల కోట్లకు చేరిందన్నారు. రిజర్వాయర్ల కెపాసిటీ 68 టీఎంసీలకు తగ్గిందన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ఖర్చు చేసింది కేవలం 26,262 కోట్ల రూపాయలు, డి పి ఆర్ సమర్పించే నాటికి ఖర్చు రూపాయలు 55.083 కోట్లకు పెరిగింది అంటే ప్రాజెక్టు పనులు ఎంత శాతం పూర్తయ్యాయో ఇక్కడే అర్థం చేసుకోవచ్చన్నారు. ఒక్క పాలమూరు రంగారెడ్డి నే కాకుండా ఉమ్మడి పాలమూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ,మహబూబ్ నగర్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ముడా చైర్మన లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత మధుసూదన్ రెడ్డి, గారు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఫయాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ ఆవేజ్ అహ్మద్,ఐ ఎన్ టి యు సి శజిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ బెనహర్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, సీనియర్ నాయకులు పీర్ మహ్మద్ సాధిక్,రాఘవేందర్ రెడ్డి , శెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రజాపాలన

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

పేద ప్రజల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ప్రాధాన్యత ఇస్తుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ల మార్గదర్శకత్వంలో ప్రజా సంక్షేమ బడ్జెట్ లో 2 లక్షల పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వేగంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజాప్రభుత్వంలో జవాబుదారీతనంతో పని చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తుందని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలు పాటు పడుతుందన్నారు. కావున కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## మేడ్చల్ ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- మాజీ వైస్ ఛైర్మన్ చీర్ల రమేష్
- అధికారులకు వినతిపత్రం



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరా, శానిటేషన్, డంపింగ్ యార్డ్ చెత్త సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ శనివారం సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చీర్ల రమేష్ మేడ్చల్ ప్రజలు గత కొంత కాలంగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని (HMWSSB) ఎండి అశోక్ రెడ్డి కి వివరించారు. దీనికి వెంటనే స్పందించిన వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి ఈ సమస్యకు వారం రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని చీర్ల రమేష్ తెలిపారు. అనంతరం సైబర్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ శ్రీజనా ను కలిసి శానిటేషన్, అద్వెల్లి డంపింగ్ యార్డు సమస్యలను వివరించారు. అద్వెల్లి డంపింగ్ యార్డులో చెత్త తగలబెట్టడం వల్ల వస్తున్న పొగ దుర్వాసన కారణంగా ప్రజలు అనారోగ్యాల బరిన పడుతున్నారని కమిషనర్ కు దృష్టికి తీసుకెళ్లామని రమేష్ తెలిపారు. మేడ్చల్ సమస్యల పై అధికారులు సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

## గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడి

**జయభేరి, దేవరకొండ :**



ముమ్మాటికీ ఇది సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి ఆయన అన్నారు.పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని ఆయన అన్నారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా అని ఆయన అడిగారు.కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై దాడులు, ప్రజా సంఘాలపై దాడులు, మీడియా పై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా ఎందుకు అడ్డుకోవడం లేదు అని ఆయన అన్నారు.ఒకవైపు హేట్ స్పీచ్ బిల్ పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన అని ఆయన ప్రశ్నించారు.ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా ఆయన అన్నారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారా అని అన్నారు.ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే...ఇక్కడ పాలనను ఎవరు చూస్తారు,ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు అని ఆయన అన్నారు.మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదు. ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటం అని ఆయన అన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర తెలంగాణ డీజీపీ డిమాండ్ చచేశారు.ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

## అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై నుంచి అక్రమంగా కిందకు రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి ముల్లంగిరి శ్రీహరి చారి, బిజెపి సీనియర్ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా తదితరులు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశుకు వినతిపత్రం సమర్పించారు. చెరువు కట్టను తవ్వి ఈత చెట్లను నరికివేసి రోడ్డు వేశారని తెలిపారు. అంతేగాక చెరువు కట్ట బఫర్ జోన్ లో నిర్మాణం చేస్తున్నారని, జాతీయ రహదారిని ఆనుకొని అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా రోడ్డు వేసి అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద మొత్తంలో మామూళ్ళు తీసుకొని పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. రోడ్డుకు, అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్ చెరువు కట్ట తవ్విన విషయం తెలిసినప్పటికీ ఇటువైపు రావడంలేదని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, హైడ్రా, సిడిఎంఏ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు స్పష్టం చేశారు.

## స్కూల్ ఫీజులపై తల్లిదండ్రుల ఆందోళన

**జయభేరి, హైదరాబాద్ :**



హైదరాబాద్లోని షేక్పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అడ్మిషన్ సమయంలో ప్రతి మూడు సంవత్సరాలకు కేవలం 10 శాతం మాత్రమే ఫీజు పెంపు ఉంటుందని హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ప్రతి ఏడాది ఫీజులను పెంచుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా తరచూ పెరుగుతున్న ఫీజులు తమపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని తల్లిదండ్రులు తెలిపారు. అంతేకాకుండా, జూలైలో చెల్లించాల్సిన ఫీజును ముందుగానే మార్చిలోనే వసూలు చేయడం, మళ్లీ జూలైలో సెకండ్ టర్మ్ ఫీజు పేరుతో వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు చెల్లింపులో ఒకరోజు ఆలస్యమైనా రోజుకు పది రూపాయల పెనాల్టీ విధించడం కూడా తీవ్రంగా బాధిస్తున్న అంశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలు బలంగా ఉన్నప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమని చెబుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల ఇలాంటి ఫీజు విధానాలను ప్రభుత్వం కట్టడి చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## హెల్మెట్ ధరించినవారికి శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానం

- దొనకొండ సర్పంచ్ వినూత్న రీతిలో హెల్మెట్ అవగాహన
- దొనకొండ సర్పంచ్ ఆవుల శ్రావణి సురేష్ యాదవ్

**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 04 :**

మండలం దొనకొండ గ్రామ సర్పంచ్ ఆవుల శ్రావణి సురేష్ యాదవ్ వినూత్న రీతిలో ఎలిమెంట్ ధరించకుంటే జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులకు శాలువాతో సన్మానించి వారి పుష్పగుచ్చాలు అందజేసి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనివారిని వేడుకుంటు,ప్రమాదం వల్ల కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబం ఎంత ఇబ్బంది పడుతుందో తెలియజేస్తూ హెల్మెట్ ధరించడంలో ప్రతి ఒక్కరూ మరొకరికి ఆదర్శంగా నిలవాలని గ్రామముకు వస్తున్న వాహనదారులకు, వెళ్తున్న వాహనదారులకు గురువారం పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించారు,ఇలా చేయడంతో పలువురు సర్పంచి పనితీరును ప్రజలు అభినందించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ గ్రామ పార్టీ నాయకులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు ప్రముఖులు పాల్గొన్నారు

## వేములపల్లి లో బాలవికాస చలివేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన సర్పంచి రవి



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 04 :**

మండలంలోని వేములపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడవెల్లి రవి దాతగా ముందుకు రావడం జరిగింది. ఎండాకాలంలో మూడు నెలలు చలివేంద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పంతో వారు ముందుకు వచ్చి దాహార్తులకు సేవన అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఓపెన్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో డి ఎల్ పి పుల్లారావు, కార్యదర్శి శ్రీధర్, గ్రామ పెద్దలు ,లీడర్లు, సభ్యులు ,డీలర్ ఐలయ్య, గుమ్మడవెల్లి సుధాకర్, రమేష్ గుమ్మడవెల్లి నరసయ్య, శారద, దేవకమ్మ, పద్మ, వార్డ్ మెంబర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 04 :**

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు చిలుముల సంపత్ తమ్ముడు చిలుముల సాయి ప్రవళిక వివాహం దంతాలపల్లి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరుగగా వివాహానికి సామాజిక విద్యావేత్త సేను రాజేష్, మార్త శ్రీనివాస్, దాసరి యాకయ్య, సేను రమేష్, శ్రీకాంత్, చిలుముల శ్రీను తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## అనాథ యువతి వివాహానికి ఆర్థిక సాయం



**జయభేరి, దేవరకొండ :**

అనాథ యువతి వివాహానికి అండగా నిలిచిన BRS పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ₹50,000 ఆర్థిక సాయం, పట్టుచీర అందజేత దేవరకొండ మండలంలోని పర్వతండకు చెందిన నేనావత్ సోని యువతి వివాహానికి కిషన్ నాయక్ పెద్దన్నలా మారి అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సోని పరిస్థితిని తెలుసుకున్న ఆయన, ఆమె వివాహానికి తన వంతు సహాయంగా ₹50,000/ (యాభై వేల రూపాయలు)నగదుతో పాటు, నూతన వధువుకు పట్టుచీరను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదుకోవడం మనందరి బాధ్యత సోని వివాహం ఘనంగా జరగాలని, ఆమె నూతన జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం నా బాధ్యతగా భావిస్తాను, అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామావత్ రవి, పల్త్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తమ్ముళ్లకు బాబు ఫుల్ క్లాస్

- గీత దాటితే సస్పెండ్ చేస్తా" మరోసారి అధినేత వార్నింగ్

**జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 4 :**



ఆంధ్రప్రదేశ్‌లో మరో అధికార పార్టీ ఎమ్మెల్యే జులుం ప్రదర్శించారు. యథావిధిగా అధినేత సమగ్ర రిపోర్ట్ కావాలని ఆదేశించారు. రిపోర్టు వచ్చింది. అంతే హెచ్చరికల ప్రకటన వచ్చేసింది. ఇది సింపుల్‌గా పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారంలో జరిగింది. ఇలాంటి హెచ్చరికలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు ఇస్తూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకున్న ఘటనలు లేవనే చెప్పాలి. ఇప్పుడు కూడా ఈ ప్రకటన చూసిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలే మాకు నమ్మకం లేదు బాబు అని చెప్పే పరిస్థితికి వచ్చింది. పల్నాడు ఎస్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే అరవిందబాబు హల్‌చల్ చేశారు. లీగల్ అడ్వైజర్ నియామకం విషయంలో పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. తాను సూచించిన పేరు ఎందుకు ఆమోదించలేదని వారితో గొడవ పెట్టుకున్నారు. ఎస్పీ ఆఫీస్‌లోనే రాత్రంతా ధర్నా చేశారు. అధికారిక ఉత్తర్వులు తన చేతిలో పెట్టే వరకు కదిలేది లేదని తేల్చారు. అధిష్ఠానం నుంచి ఫోన్లు చేసి చెప్పినా వినిపించుకోలేదు. అరవిందబాబు చేసిన వీరంగం వీడియోలు, వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి దీని వల్ల జరిగిన డ్యామేజీని టీడీపీ గ్రహించి దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ఓపెన్‌గానే చంద్రబాబు ఆయనకు వార్నింగ్ ఇచ్చారు. ఫ్రస్ట్రేషన్ ఎక్కువైతే ధ్యానం చేయాలని సూచించారు. తర్వాత పూర్తి విచారణ జరిపి ఏం జరిగిందో చెప్పాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఆదేశించారు. దీనిపై విచారణ చేసిన శ్రీనివాస్ సమగ్ర నివేదికను చంద్రబాబు టేబుల్‌పై పెట్టారు. పూర్తి నివేదిక చూసిన చంద్రబాబు ఇకపై క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడితే సహించేది లేదని తన రెగ్యులర్ డైలాగ్ చెప్పేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని, ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తే ఉపేక్షించబోనని అన్నారు. ఒకసారి గెలిస్తే కొమ్ములు వచ్చినట్టు ప్రవర్తిస్తే రాజకీయ జీవితం నాశనం అయిపోతుందని అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తుల ప్రభావం పార్టీపై పడకుండా ఘటన జరిగిన వెంటనే సస్పెండ్ చేస్తానంటూ స్టేట్మెంట్ ఇచ్చారు. ఇలాంటి వార్నింగ్ ఇవ్వడం ఇది మొదటిసారి కాదు. కానీ చివరి సారి కావాలని తెలుగు తమ్ముళ్లు కోరుకుంటున్నారు. కోనేటి ఆదిమూలం నుంచి నేటి అరవింద్‌బాబు వరకు చాలా మంది గీతదాటి ప్రవర్తించారు. ఇందులో కోనేటి ఆదిమూలం నుంచి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత ఏం అయిందో ఎవరికీ తెలియదు. ఆయన మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి వీడియోలకు దొరికిపోయారు. తర్వాత అతిగా ప్రవర్తించింది అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్. వార్ 2 విడుదల సందర్భంగా ఎన్టీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు కామెంట్స్ చేశారు. తర్వాత చాలా విషయాల్లో ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఆయన్ని పిలిచి వార్నింగ్ ఇచ్చింది. కానీ తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. ఆయన అప్పుడప్పుడు ఇలా నోరుజారుతూనే ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఫేమస్ అయిన మరో వ్యక్తి తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ విషయంలో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యింది. ఆయన ఏకంగా ఎంపీ కేశినేని చిన్నిపైనే తిరుగుబాటు చేశారు. బహిరంగంగానే ఫైట్‌కు దిగారు. ఇలా ఒకట్రెండు సార్లు కాదు చాలా సార్లు జరిగింది. ఇలా జరిగిన ప్రతిసారీ ఆయన్ని పిలిచి మందలించడం, జాగ్రత్తలు చెప్పడం తిరిగి పంపేయడమే జరిగింది. కానీ సీరియస్‌గా తీసుకున్న చర్యలు లేవు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ డ్రగ్స్ తీసుకొని తెలంగాణ పోలీసులకు దొరికిపోయారు. దీనిపై కూడా చంద్రబాబు సీరియస్ అయ్యారు. రిపోర్టును అడిగారు. ఇచ్చిన తర్వాత ఆయనపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియదు. ఈ మధ్య నెల్లూరు చెందిన నేతలు గెస్ట్ హౌస్‌లో అమ్మాయితో రొమాన్స్ చేస్తూ కెమెరాలకు చిక్కారు. కానీ వారిపై తీసుకున్న చర్యలేంటో బయటకు రాలేదు. ఇలా తప్పు చేసిన నేతలను వార్నింగ్ ఇవ్వడంతోనే సరిపోతుంది. అంతేకానీ వారిపై చర్యలు తీసుకున్న ఘటనలు లేవని టీడీపీ నేతలే అంటున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని ఒకసారి వార్నింగ్ వచ్చిన తర్వాత మరొకరు తప్పు చేయడానికి కూడా భయపడే పరిస్థితి ఉండేదని ఇప్పుడు పార్టీలో అలాంటి సిస్టమ్ లేదని అంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన మొదట్లో ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత కల్తీ లిక్కర్ కేసులో ఉన్న జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడిని సస్పెండ్ చేశారు. ఇప్పటి వరకు పార్టీ తీసుకున్న కఠినమైన చర్యలు ఘటనలు ఇవే. ఇంతకు మించి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**మేమే బెటర్ అంటున్న టీడీపీ నేతలు**

ఇలాంటి వాటిపై టీడీపీ నేతలు మాట్లాడితే, తమ పార్టీలోనైనా కనీసం అధినేత కలుగజేసుకొని తప్పు చేసిన వారికి ఒకట్రెండు సార్లు వార్నింగ్ ఇస్తున్నారని వేరే పార్టీల్లో కనీసం తప్పు జరిగిందా లేదా అనే విచారణ కూడా ఉండదని గుర్తు చేస్తున్నారు. గతంలో వైసీపీలో ఇలాంటివి చేసిన వారని వెనకేసుకొచ్చారే తప్ప కనీసం ఏం జరిగిందో అడిగారా అని ప్రశ్నిస్తున్నారు. తమ పార్టీ ఒకట్రెండు సార్లు వార్నింగ్‌తో సరిపెడతారని అప్పటికీ ఆ లీడర్లు మారకుంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ప్రతి దానికి సమయం సందర్భం ఉంటుందని వివరిస్తున్నారు. పదే పదే తప్పులు చేసిన వారిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇస్తున్నారు



## లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అందజేశారు. అలాగే వనపర్తి జిల్లా కేంద్రంలో మదనాపురం మండల కాంగ్రెస్ నాయకులు హనుమాన్ రావు అన్న కుమార్తె వివాహానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కురుమూర్తి దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్న చింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను స్నేహ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి శనివారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే పరిశీలించారు. దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలను వివరించి అక్కడ జరుగుతున్న అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. అలాగే స్వామివారిని ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం తిరుమలపూర్ లో అనారోగ్యంతో బాధపడుతున్న దేవరకద్ర మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సద్దాం తండ్రిని శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ పరామర్శించారు. అలాగే చిన్నచింతకుంట మండల కేంద్రంలోని వార్డు సభ్యుడు శేఖర్ కు హార్ట్ స్టంట్ వేయడంతో ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో ఉన్న కురుమూర్తి స్వామి దేవస్థానం డైరెక్టర్ శ్రీధర్ రెడ్డిని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి పార్టీ సభ పోస్టర్ విడుదల



**జయభేరి, మేడ్చల్ :**

కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయబోతున్న నూతన పార్టీని చూసి అన్ని రాజకీయ పార్టీలు ఉలిక్కిపడుతున్నాయని తెలంగాణ జాగృతి పార్టీ మేడ్చల్ నియోజకవర్గ యువ నాయకుడు గుర్రం వెంకటేష్ అన్నారు. ఏప్రిల్ 25న మేడ్చల్ జిల్లా మునిరాబాద్ లో కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ సభ సందర్భంగా గుర్రం వెంకటేష్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గుర్రం వెంకటేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని కవిత స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎత్తారి గణేష్, కందాడి గౌతమ్ రెడ్డి, మంచాల వంశీ చారి, గిరిశెట్టి రాజు, వరికుప్పల సంతోష, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో చలివేంద్రం

**జయభేరి, దేవరకొండ :**



వాసవి క్లబ్ , వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణంలో మేఘ చలివేంద్రం ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ కుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ ప్రారంభించారు. గత 20 సంవత్సరాల నుండి వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మేఘ చలివేంద్రాన్ని బస్టాండ్ లో బాటసారులకు దప్పికను తీర్చే కార్యక్రమాన్ని తీసుకొని ప్రతిరోజు 50 నుంచి 60 మినరల్ క్యాన్సు వాటర్ తెప్పించి బస్టాండ్ లో బస్సు ఎక్కే వాళ్లకు బాటసారులకు దప్పిక తీర్చడం వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ సభ్యులకె సాధ్యం అని అభినందించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో కూడా మేఘ చలివేంద్రాన్ని నడిపియాలని వారు కొనియాడారు ప్రముఖ వ్యాపార వేత కుంచకూరి అశోక్ జన్మదిన సందర్భంగా మేఘ చలివేంద్రం వద్ద బటర్ మిల్క్ , పులిహోర పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పానుగంటి మల్లయ్య వాసవి కళ్యాణ మండపం అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు కిరాణం అసోసియేషన్ అధ్యక్షులు నీలా బుచ్చయ్య IPC లు బెలిజ మాధవి గోవిందు కొండయ్య వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ఉపకోశాధికారులు ఆలంపల్లి పద్మ నీల సంజీవ్ కుమార్ వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి అంజనేయులు వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి కార్యదర్శి బెల్లిదే రవీందర్ కోశాధికారులు ఆలంపల్లి శిరీష పందిరి వెంకన్న ఉప్పల శ్రీనివాసులు కుంచకురి అశోక్ సంధ్యారాణి ఇదుకుల పుల్లయ్య , ఆర్యవైశ్య సంఘం సభ్యులు , వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ సభ్యులు ఆర్టీసీ స్టాఫ్ ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ ఫామ్ హౌస్ పై కాంగ్రెస్ దాడి హేయమైన చర్య

- మాజీ కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గజ్వేల్ క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడి హేయమైనా చర్య అని గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ అమరం జైపాల్ రెడ్డి విమర్శించారు. పిరికిపందల క్యాంపు పై దాడి చేసి కావాలని కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో పెట్టడం సరైన చర్య కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు రెండున్నర సంవత్సరాలు అయినప్పటికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీ ఎక్కడ అని అధికారులను మరియు కాంగ్రెస్ నాయకులను నిలదీయడం గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు కావాలని గజ్వేల్ లో మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం పై దాడి చేసి, అక్కడ ఫర్నిచర్ ను అద్దాలను కూడా ధ్వంసం చేయడం జరిగిందని, తెలంగాణ తెచ్చిన మాజీ సీఎం కెసిఆర్ నియోజకవర్గంలో పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇలాంటి సంస్కృతి తెలంగాణ లో గతంలో ఎప్పుడూ లేదని ఇలాంటి వాటిని ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులు తక్షణం స్పందించి ఇట్టి దాడికి పాల్గొన్న వారిని గుర్తించి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని అమరం జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

## పరకాలను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది
- రాజుపేట యందు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

**జయభేరి, పరకాల, ఏప్రిల్ 04:**



శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, సమయానికి పూర్తి చేసి 18 నెలలలో అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. అలాగే త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో శంకుస్థాపన చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.

## రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే




**జయభేరి, మల్లాపూర్ :**

యునైటెడ్ హెచ్ బీ కాలనీ, మల్లాపూర్, నాచారం పాస్టర్స్ అండ్ బిలీవర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని హెచ్ బీ కాలనీ వార్డు కార్యాలయం దగ్గర నుండి జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య. ఈ ర్యాలీ నాచారం జూడియో వరకు రన్ ఫర్ జీసస్ నినాదాలతో కొనసాగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు..తూ యేసు క్రీస్తు పునరుత్తనమై లేచిన రోజని ఈ యొక్క కార్యక్రమం నిర్వేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే ప్రతి ఒకరు ఒకరితో మరొకరు ప్రేమ, సమాధానం కలిగి ఉండాలని మరియు ప్రపంచ శాంతి వర్ధిల్లాలని అన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

- రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది
- రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నాం

**జయభేరి, పరకాల ఏప్రిల్ 04:**



శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నందు పరకాల పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే కనీస మద్దతు ధర క్వింటాల్ కి 2400 రూ లభిస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని అధికారులకు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.




# గుజరాత్‌పై ఉత్కంఠ విజయం

జయభేరి, అహ్మదాబాద్:

ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య పోరు అభిమానులకు పసందైన విందు అందించింది. ఆఖరి బంతి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో గుజరాత్‌పై రాజస్థాన్‌దే పైచేయి అయ్యింది. రాయల్స్ నిర్దేశించిన 211 పరుగుల లక్ష్యఛేదన కోసం ఆఖరి ఓవర్‌లో విజయానికి 11 పరుగులు అవసరమైన దశలో గుజరాత్ నాలుగు పరుగులు చేసి వికెట్ కోల్పోయి ఓటమి వైపు నిలిచింది.

తుషార్ దేశ్‌పాండే సమయోచిత బౌలింగ్‌తో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(44 బంతుల్లో 73, 9ఫోర్లు, 3సిక్స్‌లు) బాధ్యాతాయుత అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, సహచరుల నుంచి సహకారం కరువైంది. బట్లర్(26), కెప్టెన్ రషీద్‌ఖాన్(24), రబాడ(23 నాటౌట్) పోరాడినా ఆఖరి మెట్టుపై గుజరాత్ బోల్తా కొట్టింది. భారీ లక్ష్యఛేదనలో గుజరాత్‌కు మెరుగైన శుభారంభం దక్కింది. గిల్ గైర్హాజరీలో అరంగేట్రం ప్లేయర్ కుమార్ కుశాగ్ర(18)తో కలిసి సుదర్శన్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. రాయల్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ సుదర్శన్ 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో విజృంభించాడు. అయితే మిడిలార్డర్‌లో ఫిలిప్స్(3), సుందర్(4), తెవాటియా(12), షారుఖ్‌ఖాన్(11) స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయారు. ఇంప్యాక్ట్ ప్లేయర్ రవి బిష్ణోయ్(4/41) నాలుగు కీలక వికెట్లు తీసి గుజరాత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. అంతకుముందు ధృవ్ జురెల్(42 బంతుల్లో 75, 5ఫోర్లు, 5సిక్స్‌లు), జైస్వాల్(55) అర్ధసెంచరీలతో రాజస్థాన్ 20 ఓవర్లలో 210/6 స్కోరు చేసింది. జురెల్ తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరిస్తూ జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. రబాడ(2/42) ఆకట్టుకున్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లలో 210/6(జురెల్ 75, జైస్వాల్ 55, రబాడ 2/42, అశోక్ 1/37),

గుజరాత్: 20 ఓవర్లలో 204/8(సుదర్శన్ 73, బట్లర్ 26, బిష్ణోయ్ 4/41, దేశ్‌పాండే 1/24)




# ముంబైని చిత్తుగా ఓడించిన ఢిల్లీ..!

పంతొమ్మిదో సీజన్‌లో ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(90) జోరుతో ఢిల్లీ క్యాపిటల్స్ వరసగా రెండో విజయంతో మురిసింది. సొంత మైదానంలో రిజ్వీ దూకుడు ముందు ముంబై ఇండియన్స్ బౌలర్లు తేలిపోగా.. 163 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ ఉఫ్‌మనిపించింది. ఆరంభంలోనే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని రిజ్వీ ఓపెనర్ పథుమ్ నిశాంక(44)తో కలిసి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఈ హిట్టర్‌కు డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) మెరుపులు తోడవ్వగా.. 18.1 ఓవరల్లోనే మ్యాచ్‌ను ముగించింది ఢిల్లీ. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఛేజింగ్ జట్లు విజయదుంధుబి మోగిస్తున్నాయి. తమ సొంత ఇలాకాఆరుణ్ జైట్లీ స్టేడియంలో పంజా విసిరిన ఢిల్లీ క్యాపిటల్స్ పటిష్టమైన ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత ప్రత్యర్థిని 163కే కట్టడి చేసింది ఢిల్లీ. ఛేదనలోఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(90) ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడగా.. మోస్తరు లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ పథుమ్ నిశాంక(44) రాణించగా.. డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) తన స్టయిల్లో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. 6 వికెట్ల తేడాతో జయభేరి మోగించిన అక్షర్ పటేల్ సేన.. నాలుగు పాయింట్లు సాధించింది.

తొలి మ్యాచ్‌లో విజయంతో ఆత్మవిశ్వాసంతో ఢిల్లీలో అడుగుపెట్టిన ముంబై ఇండియన్స్‌కు ఆతిథ్య జట్టు ఆరంభంలోనే షాకిచ్చింది. ముకేశ్ కుమార్, అక్షర్ పటేల్ విజృంభణతో 18 పరుగులకే రియాన్ రికెల్టన్(9), తిలక్ వర్మ(0)లు పెవిలియన్ చేరారు. ఆ దశలో రోహిత్ శర్మ(35)తో కలిసి ఇండియన్స్‌ను సూర్యకుమార్ యాదవ్(51) ఆదుకున్నాడు. ఆఖర్లో నమన్ ధిర్(28), మిచెల్ శాంట్నర్(18 నాటౌట్)లు బ్యాట్ ఝులిపించడంతో ముంబై నిర్ణీత ఓవర్లలో పరుగులు చేసింది.

# హోరాహోరీగా దక్కన్ పాడెల్ లీగ్

జయభేరి, హైదరాబాద్ :

దక్కన్ పాడెల్ లీగ్(డీపీఎల్) పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మహావీర్ స్టార్స్ ఆతిథ్యమిచ్చిన లీగ్‌లో ప్లేయర్లు తమదైన ప్రతిభతో ఆకట్టుకున్నారు. కొత్త ప్రమాణాలు నెలకొల్పుతూ ప్లేయర్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. టెన్నిస్‌ను పోలిన ఈ ఆటలో సింగిల్స్‌తో పాటు డబుల్స్ మేళవింపుగా ప్లేయర్లు తలపడ్డారు. కేవలం ఆటకే పరిమితం కాకుండా ప్రేక్షకులకు లైఫ్‌స్టయిల్‌ను పరిచయం చేయడం మారుతున్న శైలికి నిదర్శనమని నిర్వాహకులు పేర్కొన్నారు.






## అందంతో గత్తరలేపిన రాజాసాబ్ ముద్దుగుమ్మ..

అందాల ముద్దుగుమ్మ రిద్ది కుమార్.. ఈ అమ్మడు రాజ్ తరుణ్ హీరోగా నటించిన లవర్ అనే సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. లవర్ సినిమాలో అందం, అభినయంతో కట్టిపడేసింది రిద్ది కుమార్. చాలా కాలం గ్యాప్ తీసుకున్న తర్వాత ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ సినిమాలో కీలకపాత్రలో కనిపించింది. ఈ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా తన నటనతో ఆకట్టుకుంది ఈ చిన్నది. రాధేశ్యామ్ సినిమాలో ఒక చిన్న పాత్రలు తళుక్కున మెరిసింది ఈ ముద్దుగుమ్మ. రాధేశ్యామ్ సినిమాలో అర్చరీ ప్లేయర్ గా కనిపించింది. ఈ బ్యూటికి అనుకున్నంతగా అవకాశాలు కూడా టాలీవుడ్ లో రావడం లేదు. ఇటీవలే ప్రభాస్ హీరోగా నటించిన రాజా సాబ్ సినిమాలో నటించింది. రాజా సాబ్ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించింది కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. రాజాసాబ్ సినిమాలో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది ఈ సుందరి. కానీ తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అలాగే అటు మలయాళంలోనూ వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ లేటెస్ట్ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. నెట్టింట గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కవ్విస్తుంది. కెరీర్ తొలినాళ్లలో ఈబ్యూటీ గ్లామర్ రోల్స్ చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. దీంతో ఈ భామకు అవకాశాలు అంతగా రావడం లేదని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం గ్లామర్ రోల్స్ లోనూ కనిపిస్తూ మెప్పిస్తుంది రిద్ది కుమార్.



## ఆ హీరో నన్ను తిట్టాడు..

### షాకింగ్ విషయం చెప్పిన జేడీ చక్రవర్తి

నటుడు జేడీ చక్రవర్తి తన కెరీర్‌లోని పలు ఆసక్తికరమైన సంఘటనలను, ముఖ్యంగా తన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్‌గా భావించిన వాటిని గతంలో ఒక ఇంటర్వ్యూలో వివరించారు. వాటిలో నాగార్జునతో శివ చిత్రం షూటింగ్‌లో జరిగిన ఒక సంఘటన కీలకం. ఈ సంఘటన హైలైట్ కేఫ్‌లో చోటుచేసుకుంది. జేడీ చక్రవర్తి కొత్త నటుడిగా తన మొదటి సినిమా షూటింగ్‌లో ఉండగా, నాగార్జున గారు అప్పటికే స్టార్‌డమ్‌లో ఉన్నారు. ఆయన బయటికి వస్తుండగా జేడీ చక్రవర్తి అనుకోకుండా ఢీకొన్నారట. దీనిపై నాగార్జున కోపంగా మాట్లాడటం, చూసుకొని నడవవా.? అని అనడం, అనంతరం జేడీ చక్రవర్తిని కొట్టడం జరిగిందని వివరించారు. మొదట అది ఒక పెద్ద గొడవగా, బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్‌గా అనిపించినప్పటికీ, ఇది నిజానికి ముందుగా ప్రణాళిక చేసిన ఒక ఫైట్ సీక్వెన్స్ అని జేడీ చక్రవర్తి వెల్లడించారు. అప్పుడు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ, గోపాల్ రెడ్డిలు ఈ సన్నివేశాన్ని క్యాండిడ్‌గా చిత్రీకరించాలని నిర్ణయించారని, ఇది శివ సినిమాలో ఇరానీ కేఫ్ ఫైట్‌గా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. ఈ సంఘటన కేవలం సినిమా చిత్రీకరణలో భాగంగా జరిగిందని, అందుకే ఇది గుడ్ ఎక్స్‌పీరియన్స్ అని అన్నారు. అయితే, తన అసలైన బ్యాడ్ ఎక్స్‌పీరియన్స్ హీరోయిన్ ఆమలతో జరిగిన ఒక ఇబ్బందికర సంఘటన అని జేడీ చక్రవర్తి పేర్కొన్నారు. శ్రీదేవి తర్వాత తాను ఎక్కువగా ఆరాధించే నటి అమల అని ఆయన తెలిపారు. ఒక సన్నివేశం చిత్రీకరణ జరుగుతున్నప్పుడు, పాఠశాల నుంచి ఎవరో ఒక అమ్మాయిపై రాళ్లు విసురుతున్నారని జేడీ చక్రవర్తి గమనించారు. అమల అప్పటికే పుష్పక్ వంటి చిత్రాలలో నటించి తనకు ఎంతో అభిమానమని, అందుకే ఆ విషయం చెప్పడానికి ఉత్సాహంగా అమల వద్దకు వెళ్లినప్పుడు, తాను చెప్పదలచుకున్న విషయాన్ని సరిగ్గా వ్యక్తం చేయలేకపోయానని అన్నారు. సమ్మర్ సమ్మర్, సో అండ్ సో అని తడబడినప్పుడు, అమల ఎవరో రాళ్లు విసురుతున్నారని చెప్పదలుచుకున్నారా?" అని ప్రశ్నించడం తనకు చాలా అవమానకరంగా, ఇబ్బందికరంగా అనిపించిందని జేడీ చక్రవర్తి గుర్తుచేసుకున్నారు. ఇవి కాకుండా, జేడీ చక్రవర్తికి అన్నయ్య అనే పదంపై ఉన్న వ్యతిరేకతను కూడా వెల్లడించారు. తెలుగు భాషలో తనకు ఇష్టం లేని ఏకైక పదం అన్నయ్య అని ఆయన స్పష్టం చేశారు. బావ అనే పదంపై ఎక్కువ ఇష్టం ఉందని పేర్కొన్నారు. అలాగే, నాగార్జున హీరోగా నటించిన సినిమాలో తాను మొదటి సారి నటించగా, నాగచైతన్య హీరోగా ఉన్న జోష్ చిత్రంలో విలన్‌గా చేశానని తెలిపారు. ఈ సంఘటనలన్నీ తన సినిమా ప్రయాణంలో భాగమేనని జేడీ చక్రవర్తి వివరించారు.

## రామాయణలో ద్విపాత్రాభినయం



రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా, నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. ఇటీవల విడుదలైన టీజర్‌కి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలావుంటే.. ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ వెల్లడించిన తాజా అప్‌డేట్ హాట్ టాపిక్‌గా మారింది. 'రామాయణ'లో ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నారట. ఈ విషయం గురించి రణ్‌బీర్ స్వయంగా మాట్లాడుతూ 'శ్రీమహావిష్ణువు 6వ అవతారం భార్గవరాముడు. 7వ అవతారం రఘురాముడు. ఇందులో నేను రఘురాముడి పాత్రతో పాటు భార్గవ రాముడిగా కనిపించనున్నాను. ఈ సినిమాకు సైన్ చేసిన తర్వాత సంవత్సరం పాటు ఈ రెండు పాత్రల గురించి అధ్యయనం చేశాను. ఆ పాత్రల వెనకున్న ఆధ్యాత్మికతనూ, భావోద్వేగాలనూ లోతుగా అర్థం చేసుకున్నాను. నా పూర్వజన్మ సుకృతం వల్ల లభించిన పాత్రలు ఈ రెండూ' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు రణబీర్‌కపూర్.

## అనుష్కను కాలితో గట్టిగా తన్నా.. దాంతో ఆమెకు మెడనొప్పి వచ్చింది..



స్టార్ హీరోయిన్ అనుష్క ప్రస్తుతం ఆచితూచి అడుగులేస్తుంది. వరుసగా సినిమాలు చేయకుండా విభిన్న కథలను ఎంచుకుంటూ సినిమాలు చేసి ఆకట్టుకుంటుంది. బాహుబలి సినిమా తర్వాత సినిమాల స్పీడ్ తగ్గించింది ఈ అందాల భామ. అయితే బాహుబలి సినిమాతో పాన్ ఇండియా స్టార్ డమ్ సొంతం చేసుకున్న అనుష్క ఆతర్వాత పెద్దగా విజయాన్ని అందుకోలేక ఉయింది. చివరిగా ఘాటీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టలేకపోయింది. ఇక ఇప్పుడు ఓ మలయాళ సినిమాలో ఈ ముద్దుగుమ్మ నటిస్తుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే పోస్టర్ ను విడుదల చేశారు.

ఇదిలా ఉంటే అనుష్కను కాలితో తన్నాను అని చెప్పి షాక్ ఇచ్చాడు. అనుష్కను కాలితో తన్నా.. నావల్ల తనకు మెడనొప్పి వచ్చింది అని చెప్పాడు ఆ హీరో.. ఇంతకూ ఆ హీరో ఎవరంటే.. వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరో అడవి శేష్. ఈ యంగ్ హీరో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తూ హిట్స్ అందుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఇప్పుడు డెకాయిట్ అనే సినిమాతో ప్రేక్షకులను అలరించనున్నాడు. డెకాయిట్ సినిమా యాక్షన్ థ్రిల్లర్ గా రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అడవి శేష్ వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ బాహుబలి సినిమా సమయంలోనే మెమొరీస్ ను గుర్తు చేసుకున్నారు. బాహుబలి సినిమాలో అడవి శేష్ చిన్న పాత్రలో కనిపించాడు. భల్లాలదేవుడి కొడుకుగా కనిపించాడు శేష్. అనుష్క గురించి మాట్లాడుతూ.. ఆమె చాలా మంచి వ్యక్తి. సినిమాలో ఓ సీన్ లో ఖైదీగా పడి ఉన్న అనుష్కను కట్టెతో తడుతూ నిద్రలేపాలి.. ఆ సీన్ అయిన తర్వాత దెబ్బ తగిలిందా అని అడిగా.. కానీ అప్పటికే నా వల్ల తనకు దెబ్బ తగిలింది. నేను కాలితో తన్నడం వల్ల ఆమె మెడ నొప్పితో బాధపడింది.నిజానికి ముందు నేను నెమ్మదిగానే తన్నా.. కానీ రాజమౌళి గారే సరిపోదు గట్టిగా తన్ను అన్నారు. దాంతో బలవంతంగా తన్నాల్సి వచ్చింది.

## వాళ్లు నేరస్థులు కారు!

మద్యానికి బానిస కావడం వ్యక్తిగత పతనం ఏ మాత్రం కాదని, దాన్నొక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా చూడాలని బాలీవుడ్ భామ జాన్వీకపూర్ అన్నారు. ఇటీవల ఓ సెమినార్‌లో పాల్గొన్న జాన్వీ.. ఈ విషయం గురించి మాట్లాడుతూ 'మద్యానికి బానిసైన వాళ్ల క్యారక్టర్‌ని తక్కువ చేసి మాట్లాడటం సరైన పద్ధ తి కాదు. నిజానికి ఏ వ్యసనమైనా విలాసం కాదు. అదొక మానసిక రుగ్మత. ఒత్తిడి, ఆందోళన, ఇతర వ్యక్తిగత కారణాల వల్ల చాలామంది అనుకోకుండా వ్యసనాలకు లోనవుతుంటారు. సమాజం వారిని నేరస్థుల్లా కాకుండా.. చికిత్స అవసరమైన రోగుల్లా గుర్తించాలి. విమర్శించడం, దూరం పెట్టడం చేయకుండా, ప్రేమను పంచాలి. సమాజం నుంచి సానుభూతి, మద్దతు లభించినప్పుడే అలాంటివారు త్వరగా కోలుకోగలరు' అని చెప్పుకొచ్చింది జాన్వీకపూర్. సున్నితమైనఇలాంటి సామాజిక అంశంపై స్పష్టమైన అవగాహనతో జాన్వీ కపూర్ మాట్లాడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**